అపస్వరాలు

అతను రోడ్డుమీదకు చూశాడు. గుండె బెణికినట్లయింది. మెదడును ఎవరో గట్టిగా పట్టుకొని పిండుతున్నట్లయింది. ఒకజంట భార్యాభర్తలు గావును పోతున్నారు. వాళ్ళ భుజాలు తాకుతున్నాయి. భర్త భార్యచిటికెనవేలు పట్టుకొన్నాడు. భార్య కొడుకుచిటికినవేలు పట్టుకొన్నది. అతని కళ్ళు మెరిసి చెదిరాయి. లోతుకు దిగిన జ్ఞాపకాలు వెలికి వొచ్చి కలవరపెట్టాయి. క్షణంలో ఆ ప్రదేశంలో తుఫాను రేగింది. బజారుల్లో చెత్తాచెదారము జిమ్మున కొట్టుకుపోతున్నది. జనమంతా ఎక్కడివాళ్ళక్కడ సర్దుకొంటున్నారు. కార్లు బండ్లు, రిక్షాలు, ఇళ్ళుగూడా ఆ ప్రళయ ఝంఝకు కదిలి ఎటో కొట్టుకుపోతున్నాయి. పెద్దశబ్దం. భూమి, పచ్చిగోడలాగ నెర్రెలు నెర్రెలుగా విచ్చుకొంది. ఆ నెరియల్లోనుండి, పాముల్లాంటి నీళ్ళవూటలు బయలుదేరాయి. సూర్యకాంతికి ఆనీళ్ళు వెండి బిళ్ళలులాగా తళతళ మెరుస్తున్నాయి. కొంచెం సేపటిలోనే ఆప్రదేశంనిండా వాటికాంతులే మిగిలాయి. అతను 'అమ్మా!' అని అరిచి కళ్ళు మూసుకొన్నాడు. ఆతుఫానుకు ఆ పట్టణమంతా అతలాకుతలమయినప్పటికి, అతనుమాత్రం చెక్కుచెదరకుండా, ఇంతసేపూ అట్లాగే నిలదొక్కుకొని వున్నాడు. ఆశ్చర్యమే!

...అతను కళ్ళు తెరిచాడు. ఎదురుగా మేడ కనిపించింది. దీనిచుట్టూ ఇనుపతీగెలవల. లోపలి పూలచెట్లు, వాకిలిదగ్గరి

ఇనుప అలపమీాది సన్నజాజులు పరిమళాలను ఎగజిమ్ము తున్నాయి. అతను లోపలకు వెళ్లాడు. వెడుతున్నప్పుడు వాకిట్లోవున్నమనిషి లేచి నమస్కరిస్తూ 'మీాకోసం ఇందాకడ్నుంచీ ఎదురుచూస్తున్నాను శ్రీనివాసరావుగారూ;'అన్నాడు. శ్రీనివాసరావు ఇదేమీా వినిపించుకోలేదు. సరాసరి లోపలకు వెళ్ళాడు. కుర్చీలో కూచున్నాడు.

'ఇదిగోనండీ కాఫీ!'

అన్నది శాంత. ఆమె శ్రీనివాసరావు భార్య.

'వొద్దు.'

'ఏం?'

అన్నది నవ్వి. భర్త ఎందుకు కాఫీ వొద్దంటున్నాడో ఆమెకు తెలుసు. సీను_ శ్రీనివాసరావు ముద్దుపేరు. భార్య వేపు చూశాడు. అతనికళ్ళు మెరిశాయి.

'మీానోటి కందించటానికి నాకు తీరికలేదుబాబూ! అవతల బోలెడుపనుంది' అన్నది శాంత లేనికోపం కనబరుస్తూ, అది వుత్తికోపమేనని సీనుకుగూడా తెలుసు. అందుకే అతను భార్యకోపానికి చలించలేదు.

'నాకంటే ఇంట్లోపనే నీకు ఎక్కువయినపుడు, నిరభ్యంతరంగా వెళ్ళి పనిచూచుకోవొచ్చు' అన్నాడు కొంచెం కష్టపడటు గొంతులో స్ఫురింపచేస్తో.

'అబ్బా! అన్నీ—పోకిళ్ళు, పోకిళ్ళయినా మీా... ఊc... పట్టండి, మీారు మరీ రోజురోజుకూ చిన్నపిల్లలై పోతున్నారు.. అదుగో...అందుకే నా కోపం మండుకొచ్చేది. పాపంగదా అని కాఫీ తాగిస్తుంటేనూ— ఏమి టా చిలిపిచేష్టలు...?'

శాంత బుంగమూతి పెట్టింది. బుంగమూతి పెట్టినప్పుడు ఆమె అందం రెట్టింపుగా కనిపిస్తుంది సీనుకు. అందుకని అతను నవ్వాడు; నవ్వి శాంతను దగ్గరకు తీసుకొన్నాడు. తీసుకొని చప్పుచప్పున ముద్దుపెట్టుకొన్నాడు. అందుకు శాంత ఏమాత్రం అభ్యంతరం చెప్పలేదు.

మళ్ళీ గాలి వీచింది. ఆ గాలిలో ఆమేడకూడా కొట్టుకుపోయింది. ఆవేశానికి 'అతని' కళ్ళు తిరిగాయి. నెత్తురు పగిలింది. 'ఓహ్' అని ఛీత్కారంచేసి కళ్ళు మూసుకొన్నాడు.

...అతను కళ్ళు తెరిచాడు. అప్పటికి మధ్యాహ్నమయింది. లేచి వొళ్ళు విరుచుకొని భోజనానికి కూచున్నాడు. భార్య దగ్గరగా పీటవేసుకొని అతనికి కావలసినవి వడ్డిస్తున్నది. సీను వొకముద్ద సగం తిని మిగతాది భార్యనోటి కందించాడు.

"నాకొద్దు."

అన్నది శాంత ముఖం కొంచెం వెనక్కు తీసుకొని. అన్నం తినటం మానేశాడు. భార్యవేపు చూసి—

"ఎందుకని?" అన్నాడు.

"ఉష్ పోదురూ! మీ ఎంగిలి ఎవరు తింటారేం?" అన్నది పెదిమ కొంచెం విరిచి; అతని కళ్ళల్లోకి చూస్తూ, వొస్తున్న నవ్వును బలవంతంగా ఆపుకొంటూ.

"అట్లాగా"

అన్నాడు సీను—ఈసంగతి శాంతకు తెలీదు. అతను తెలియనివ్వలేదు కూడాను. తెలిసినట్లయితే—ఆమె ముందుగానే జాగ్రత్తపడగలిగేది ఉన్నట్లుండి సీను గబగబా కన్నులునుము కొంటున్నాడు.

"ఏమిటండీ?" అన్నది శాంత.

''కంట్లో నలకపడ్డది'' అన్నాడు సీను ఇంకా నులుము కొంటూనే.

"ఏదీ! నన్ను చూణ్నివ్వండి.''

అతను శాంతను చూడనిచ్చాడు. ఆమె చూడటానికి ముందు కొచ్చింది. ఒచ్చి కనురెప్పలు తెరిచింది. తెరిచి గట్టిగా వూదింది. సీను చప్పున భార్యముఖాన్ని దగ్గరకు తీసుకొని పెదిమలమీద ముద్దుపెట్టుకున్నాడు.

"ఛీ" అన్నది శాంత పమిటతో పెదిమలు తుడుచుకొని.

"ఇందాక ఎంగిలి పనికిరాదంటివే! అమ్మో! ఇదంతా ఎంగిలికాదు గావును - ఏం?' అన్నాడు ఆమె ముఖంలోకి సూటిగాచూస్తూ.

'అందుకనే మీరంటే నాకు మండుకొస్తుంది. పాపమనీ... పోదురూ... నే నసలు మీదగ్గిరే కూచోను.'

'ఐతే నే నన్నమే తినను.'

శాంత నవ్వింది. సీనూ నవ్వాడు.

మళ్ళీ గాలివీచింది. ఆగింది.

సన్నని వెన్నెల, పలచని గాలి, దానిమ్మచెట్టు నీడ క్రింద పెద్దమంచం. దానిమీద సీనూ, శాంతా పడుకొని వున్నారు.

'చందమామ ఎంత బాగున్నాడో చూడండి'అన్నది శాంత భర్త రొమ్ముమీద చెయ్యివేసి.

''అంతకంటె నీముఖం లక్షరెట్లు బాగుంది'' సీను రెండు చేతులతో భార్య ముఖాన్ని దగ్గరకు తీసుకొంటూ.

ఆమె ముఖం సంతోషంతో జేవురించింది. కళ్ళు మెరిశాయి. శరీరం గగుర్పొడిచింది.

'అన్నీ దొంగమాటలు' అన్నది శాంత భర్త(క్రాపులోకి వేళ్ళను పోనిస్తూ గోముగా.

'నిజం; నీతోడు.'

ఆమె కళ్ళుమూసుకొంది. అతను ఆమెకళ్ళను ముద్దుపెట్టుకొన్నాడు. ఆమె అతన్ని దగ్గరగా పొదువుకొన్నది.

'మన కొక పాపాయి వుంటే ఎంతో బావుంటుంది - కదండీ! –' అన్నది. అతన్ని కదిలిస్తూ శాంత.

''ఉండకపోవటం నాతప్పా! పోనీ నా లోటేమిటో చెప్పు. నే నేమన్నా...''

మధ్యలోనే.

'మీా కేమన్నా పిచ్చి పట్టిందా ఏమిటి?' అని అతని నోటిని చిన్నిచిన్ని వేళ్ళతో మూసింది శాంత.

గాలి వీచింది, బొమ్మలు చెరిగాయి. గాలి ఆగింది. బొమ్మలు వొచ్చాయి.

అతను రోడ్డుమీాదకు ఇంకా చూస్తూనే వున్నాడు. వయసులోవున్న ఆ భర్త, అందమైన అతనిభార్య, ముద్దులొలికే వాళ్ళ పిల్లవాడు వీధిమలుపు తిరిగారు. సీను నిట్టూర్పు విడిచాడు. రక్తమంతా జారిపోయినవాడిలా వున్నాడు.

'ఇదిగో! నిన్నే!! పలకవేం!'

అన్నది యింట్లోంచి భార్య. ఆమె కొంతకాలంనుండి భర్తను 'ఏమండి' అని పిలవటంలేదు. అతనుకూడా భార్యను "శాంతా" అని పిలవటం మానుకొన్నాడు. అందరూ అతన్ని సీనయ్యా—అనీ ఆమెను శాంతమ్మా అనీ పిలుస్తుంటారు. అయిదుగురుబిడ్డలు గలవాళ్ళను పట్టుకొని, ఇంకా ముద్దు పేర్లతో పిలవటమేమిటి కాకపోయినా?

"ఏమిటే! మళ్ళీ మొదలు పెట్టావూ నీ పాడుగోల? రామ రామ రామ! ఈ సంసారంతో ఛస్తున్నాను. భగవంతుడు నాకు చావన్నా రానివ్వడేం?' అన్నాడు సీనయ్య.

'చచ్చినా బాగుండిపోను, కొంపలో ఈ దరిద్రమన్నా లేకుండాపోతుంది. మొగదిక్కులేని సంసారమని నలుగురూ నాలుగుచేతులన్నా వూతమిస్తారు... ఇంకా కూచున్నావేం? ఇంట్లో బియ్యంలేవు. నిన్నా మొన్నా ప్లీడరుగారింట్లో అప్పు తెచ్చాను.'

'ఇంకా' అన్నాడు సీనయ్య.

'చింతపండు లేదు. కారంఐపోయి నాలుగురోజులైందని తెలుసుగా?"

'తెలుసు. ఇంకా?' అన్నాడు సీనయ్య

'పెద్దవాడికి బడిజీతం కావాలట. పొద్దున్నించీ నాప్రాణం తోడుతున్నాడు. ఇవ్వాళ ఇవ్వకపోతే పేరుతీసేస్తారుట. చంటిదానికి పాలడబ్బా పట్టుకురండి. నిన్నసాయంత్రమే నీళ్ళు పోసి కడిగాను.'

'ఓహో' అన్నాడు సీనయ్య.

'ఇంటాయన వొస్తే ఇందాక కాళ్ళుపట్టుకొని బ్రతిమిలా డాను. సాయంత్రం ఇవ్వకపోతే, కుండా చట్టీ బైట వేస్తా నన్నాడు.'

'కూరలవాళ్ళతోటీ, పాలమనిషితోటీ చెప్పలేక నా దుంప తెగిపోతున్నది. నామాటలు నమ్మటంగూడా మానే శారు— మరిచిపోయాను, 'రఘు'కు లివర్‌మందు సీసా కొనాలి. వాడి కడుపు మరీ బానకుమల్లే పెరుగుతున్నది.'

సీనయ్య నవ్వాడు. జుట్టు పీక్కున్నాడు. చొక్కా చింపుకొన్నాడు. రెండుచేతులూ బాగా చాపి, అలాఇలా తిరుగుతూ 'హరోం హరహరహర మహాదేవ శంభో శంకరా' అని కేకలు పెట్టాడు.

'ఏమి టా వెర్రివాగుడు' అన్నది శాంతమ్మ చీదరించు కొంటూ.

'ఇది వెర్రిగాదే బుర్రుపిట్టా' అన్నాడు సీనయ్య పక పక నవ్వి.

'ఆనక నవ్వుకోవొచ్చు. ముందు వెళ్ళండి' అన్నది శాంతమ్మ.

'ఎక్కడికి?' అన్నాడు సీనయ్య.

'డబ్బుకు, వాడు బళ్ళోకి యింకాపోలేదు' అన్నది.

'మరీమంచిది. పెద్దవాణ్ణి బడి మానుకోమను. రఘుకు ఇంక రెండురోజులుపోతే రోగం పెరిగి వాడే చదుస్తా. పీడా వొదులుతుంది. చంటిదాన్ని ఎవరికన్నా అమ్ము, ఆడబ్బుతో ఈబాకీలన్నీ తీర్చవొచ్చు. నువ్వు మీపుట్టింటికి వెళ్ళు. నేను

రైలు క్రింద తల పెడతాను. ఈ క్రాస్‌వర్డ్ పజిల్‌కు ఇంతకంటే సాల్వేషన్ లేదు.'

శాంతమ్మ తలెత్తి భర్త ముఖంలోకి చూసింది. అతని కళ్ళు నీళ్లు చిందుతున్నాయి. ముఖం ముడతలు పడ్డది. జుట్టు తెల్లబడి, పలచనైపోయింది. క్రింది పెదిమ పొడుగ్గా జారింది. నడుము వంగిపోయింది. మలేరియా రోగిలా వొణుకుతున్నాడు. ఆ స్థితిలో అతన్ని చూడలేక కళ్ళు మూసుకొన్నది. గతించిన తియ్యని జ్ఞాపకాలు శిరస్సు లెత్తాయి.

—o—